క్లుప్తంగా

స్పందనకు మూడు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం మూడు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడుకు ఫిర్యాదు చేశారు. జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్‌కాలనీని అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు చెప్పారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని, త్వరలో మరిన్ని పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్‌కాలనీలో సోమవారం కాలనీ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి గతంలో ఎన్నడూలేని విధంగా పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం 2019 సార్వత్రిక ఎన్నికల ముందు రాజకీయ లబ్ధికోసం మౌలిక సదుపాయాలు లేని గృహాలను ప్రజలకు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలని కోరారు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాపురం: ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జ్ఞానాపురానికి చెందిన ప్రకాష్‌రావు (40) క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 21వ తేదీన విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా డాక్‌యార్డ్ కృష్ణ గేటు మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌ను ఎక్కించే సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ప్రకాష్‌రావు సోమవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సింథియా: యువతీ యువకులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని రాష్ట్రానికి, గ్రామానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ముగింపు ఉత్సవాలు సోమవారం షిప్‌యార్డ్ కళాశాల క్రీడా మైదానంలో ఘనంగా జరిగాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ ప్రమీల, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ చేతుల మీదుగా మెడల్స్, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు, కోచ్‌లు శైలజ, రమణ, నీరజ, దేవుడు, సచివాలయ అడ్మిన్లు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కు సిద్ధం

నాడు: ఆ పార్కు పిచ్చి మొక్కలు, పిక్క తేలిన మార్గాలతో అంధవికారంగా ఉండేది. ఆకతాయిలకు అడ్డాగా ఉండేది. అసాంఘిక కార్యకలాపాలతో కళావిహీనంగా మారింది.

నేడు: ఆ పార్కుకు మహర్దశ పట్టింది. రూపురేఖలు మారిపోయాయి. ఇది చూసిన వారు మన పార్కేనా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రూ.50 లక్షలతో పార్కును ప్రభుత్వం అభివృద్ధి చేసింది. త్వరలో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

- 75 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు
- రూ. 50 లక్షలతో పార్కు ఆధునికీకరణ
- ముచ్చటగొలుపుతున్న వాతావరణం
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు



నేడు: పచ్చని మొక్కలు, ఆహ్లాదకర వాతావరణంలో చిల్డ్రన్ పార్కు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పార్కుల్లో నెంబర్ వన్‌గా అధికారులు చిల్డ్రన్స్ పార్కును తీర్చిదిద్దారు. సుమారు మూడు వేల రక రకాల మొక్కలు, పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్, కాలక్షేపం కోసం బల్లలు,శుభ్రమైన మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం వంటివి ఏర్పాటు చేశారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలో సుమారు 550 నివాసాలు ఉన్నాయి. వీటిలో రెండు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. అయితే వీరి కోసం సుమారు 75 సెంట్ల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేశారు.అయితే దీని ఆలనా పాలనా చూసే నాదుడు లేకపోవడంతో కళావిహీనంగా మారింది. దీంతో స్థానికులు వాకింగ్ చేయాలన్నా.. వారాంతాల్లో పిల్లలకు వినోదం కూడా కరువైంది. అయితే విషయాన్ని కాలనీ అసోషియేషన్ పెద్దలు, వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన



నాడు: అధ్వానంగా పార్కు

హెచ్‌పీసీఎల్,జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సుమారు రూ. 50 లక్షలతో ఈ పార్కును ఆధునీకీకరించే విధంగా చర్యలు తీసుకున్నారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఈ చిల్డ్రన్స్ పార్కును ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.





పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



కడియం నుంచి తీసుకువచ్చిన మొక్కలతో సుందరంగా ఉన్న చిల్డ్రన్ పార్కు

పార్కులో కల్పించిన వసతులు

- పార్కు చుట్టూ సుమారు 3 వేల వివిధ రకాల మొక్కల పెంపకం
- చిన్నపిల్లలు ఆడుకునేందుకు అధునాతన ఆటపరికరాలు ఏర్పాటు చేశారు.
- పెద్దలు వాకింగ్ చేసుకునేందుకు సుమారు 500 అడుగులతో వాకింగ్ ట్రాక్
- సాయంత్రం వేళ పెద్దలు కాలక్షేపం కోసం విశాలమైన బల్లలు,రచ్చబండ
- మరుగుదొడ్లు,మంచినీటి సౌకర్యం
- పార్కులోకి పశువులు చొరబడకుండా రక్షణ గేట్లు
- పార్కును 24 గంటలు పరిరక్షించేందుకు ప్రత్యేకమైన టీమ్ ఏర్పాటు

ప్రజలకు ఆహ్లాదం పంచేలా.



గుల్లలపాలెం వుడా కాలనీ వాసులకు ఆహ్లాదం పంచేలాని చిల్డ్రన్ పార్కు ఆధునికీకరించాం. జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్ అధికారులతో మాట్లాడి వారి సాయంతో పార్కును అభివృద్ధి చేశాం.మిగిలిన పార్కులకు ఆదర్శంగా నిలిచే విధంగా డిజైన్ చేయించాం. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజలకు అందుబాటులోకి తేస్తాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

మాట నెలబెట్టుకున్నాం



ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కాలనీకి వెళ్లినప్పుడు కాలనీ వాసులు పార్కు దుస్థితిని వివరించారు. అధ్వానంగా ఉన్న పార్కును అభివృద్ధి చేస్తామని ఆ సమయంలో మాట ఇచ్చాం. దాని ప్రకారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో పార్కును రూ. 50 లక్షలతో ఆధునికీకరించాం. -పి.వి.సురేష్,60 వార్డు కార్పొరేటర్

చాలా సంతోషంగా ఉంది



మా కాలనీలో ఇంత సుందరమైన పార్కు నిర్మాణం చేయడం చాలా సంతోషంగా ఉంది. దీనికి సహకరించిన పాలకులకు, జీవీఎంసీ అధికారులకు కృతజ్ఞతలు. నాడు పార్కును.. ప్రస్తుతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన చిల్డ్రన్ పార్కును చూస్తే ఆనంధంగా,సంతోషంగా ఉంది.

– కె.బంగారురాజు, వుడాకాలనీ గౌరవ అధ్యక్షుడు

ఆదర్శంగా నిలుస్తుంది



విశాలమైన ప్రదేశంలో పచ్చటి మొక్కల నడుమ,సర్వాంగ సుందరంగా చిల్డ్రన్ పార్కును అభివృద్ధి చేయడం చాలా ఆనందంగా ఉంది. పార్కు నిర్మాణం కోరకు అసోసియేషన్ తరుపున చాలా శ్రమించాం. చివరకు మంచి ఫలితం లభించింది.చాలా ఆనందంగా ఉంది.

-రాజేష్, వుడాకాలనీ కోశాధికారి

అందుబాటులో ఓటరు జాబితాలు

- ఓటర్లు అంతా పరిశీలించుకునేందుకు అవకాశం
- పశ్చిమ నియోజకవర్గంలో 14 వార్డులు, 220 బూత్‌లు
- 92వ వార్డులో అత్యధిక, 40 వ వార్డులో అత్యల్ప ఓటర్లు
- పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ



జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు మేరకు తుదిజాబితాను ప్రకటించిన రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ ఓటర్లు అంతా పరిశీలించుకునేలా అందుబాటులో ఉంచాలని యంత్రాంగానికి నిర్దేశం చేశారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం నుంచి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు ఇప్పటికే ఓటరు జాబితాలను సరఫరా చేశారు. అన్ని పోలింగ్ బూత్‌ల్లో వీటిని ప్రదర్శించే బాధ్యతలను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. జాబితాలపై అవగాన కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో యంత్రాంగం ఇదే పనిలో నిమగ్నమయ్యారు.

92లో అత్యధికం.. 40లో అత్యల్పం

నియోజకవర్గంలోని 14 వార్డుల్లో 220 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటిలో మొత్తం 2,06,943 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,02,089 మంది, స్త్రీలు 1,04,844 మంది, థర్డ్ జండర్ 10 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే, మహిళా ఓటర్లు 2,785 మంది ఎక్కువగా ఉన్నారు. 60, 90వ వార్డుల్లో మినహా మిగతా 12 వార్డుల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వీటిలో 92వ వార్డులో అత్యధికంగా 19,554 మంది ఓటర్లు ఉండగా, 40వ వార్డులో మాత్రం 5,058 మంది ఓటర్లు ఉన్నారు.

వార్డు	పోలింగ్ బూత్‌లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
40	6	2,503	2,555	0	5,058
52	16	7,821	7,862	0	15,683
56	22	7,676	8,233	2	15,911
57	21	9,339	9,653	2	18,994
58	14	6,811	7,054	1	13,866
59	17	8,883	9,045	0	17,928
60	15	8,004	7,941	4	15,949
61	15	6,891	7,276	1	14,168
62	14	7,059	7,114	0	14,173
63	10	4,133	4,249	0	8,382
89	12	6,769	7,023	0	13,792
90	17	8,155	7,989	0	16,144
91	19	8,441	8,900	0	17,341
92	22	9,604	9,950	0	19,554



మహిళా ఓటర్లు

జాబితా పరిశీలించుకోవాలి



నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాలు అందుబాటులో ఉంచాం. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే, రాతపూర్వకంగా తెలియజేయవచ్చు. ఓటర్లు అంతా జాబితాలో తమ పేరు ఉందా, లేదా అనేది పరిశీలించుకోవాలి. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు.

–హుస్సేన్ సాహెబ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ వెస్ట్ నియోజకవర్గం

గోల్డెన్ అవర్స్‌లో సాయమందించండి

కేజీహెచ్ ఆర్థో సర్జన్ డాక్టర్ రాజ్ కమల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్ కమల్

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించేందుకు సహకరించాలని కేజీహెచ్ ఎముకుల వైద్యనిపుణుడు డాక్టర్ వి. రాజ్ కమల్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నియామాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. అలా స్పందించిన వారు ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. గుడ్ సమారిటన్ గైడ్‌లైన్స్‌ను అందరూ పాటించాలని కోరారు. ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహన చోదకులు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల జరిగిన 10 ప్రమాదాల్లో 7 మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో వేణుగోపాల్, సహాయ మోటార్ వాహన తనిఖీ దారులు శ్రీనివాస యాదవ్, ఏవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 0

అంధత్వ నిర్మూలనకు కృషి

పెందుర్తి: రానున్న రోజుల్లో శంకర్ ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయ్‌కుమార్ అన్నారు. నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో సోమవారం ఆప్తమాలజీలో వచ్చిన క్లినికల్ మార్పులపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్‌ఫౌండేషన్‌లో ఆధునిక పరిజ్ఞానంతో అత్యాధునిక వైద్యం అందిస్తున్నామన్నారు. పలు కీలక అంశాలపై చర్చించారు. జీఎంఏ రాధాకృష్ణన్, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సువర్ణ, డాక్టర్ సౌమ్య, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ జి.వి రమణకుమార్, డాక్టర్ సుకుమార్, డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, డీజీఎం రమేష్‌కుమార్, డీజీఎం పీఆర్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

టీడీపీ నాయకులవి దిగజారుడు ప్రకటనలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల చేరికలంటూ తప్పుడు ప్రచారం
- 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు



సింథియా: తెలుగుదేశం పార్టీ నాయకులు మరింత నీచానికి దిగజారుతున్నారని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీతో సంబంధంలేని వ్యక్తులను తీసుకువచ్చి 40వ వార్డు వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి, మహిళా అధ్యక్షురాలు టీడీపీలో చేరారని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీతో సంబంధం లేని వ్యక్తులను చూపించి టీడీపీలో చేరారని చెప్పుకోవడమే కాకుండా టీడీపీ కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేసి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్ గెలవడం ఖాయమని గుండపు అన్నారు.

మహిళ ఆత్మహత్య

కూర్మన్నపాలెం: భర్త, అత్తమామల వేధింపులు తాళ్లలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెం లోని అంబేద్కర్‌కాలనీ రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పక్కన పార్వతీపురానికి చెందిన సైలాడ పాండురంగారావు.. తన భార్య ప్రమీల (31), ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. వీరికి 2012లో వివాహంకాగా, 11 ఏళ్ల బాబు నితీష్ కుమార్, 4 ఏళ్ల పాప నిహారిక ఉన్నారు. ఆదివారం అర్ధ రాత్రి 1.30 గంటలకు పాండురంగారావు మావయ్య పువ్వల శంరరావుకు ఫోన్ చేసి ప్రమీల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడు. దీంతో పార్వతీపురం నుంచి శంరరావు దంపతులు కేజీహెచ్‌కు చేరుకుని బోరున విలపించారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకోవడంపై అల్లుడు పాండురంగారావు, ఆయన తల్లిదండ్రులే కారణమని దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

9 నుంచి ఓపెన్ కరాటే పోటీలు



కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

సీతమ్మధార: నిజి శాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధినేత నాయుడు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

కరాటే హబ్‌గా విశాఖ..

ఎస్ఎస్‌ఎస్‌కేఏఐ చైర్మన్, సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ కరాటే ద్వారానే తాను సినీ రంగానికి వచ్చానని చెప్పారు. అయోధ్యలో శ్రీరామదాసు చిత్రంలోని తన సన్నివేశాలను ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖ కరాటే హబ్‌గా ఉండడం హర్షణీయమని, కరాటే మాస్టార్లు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కరాటే అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. క్రీడాకారులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు. సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. అనంతరం చాంపియన్‌షిప్ ట్రోఫీలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోటీ కార్యనిర్వాహక చైర్మన్ దాడి రత్నాకర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, ఎస్‌జీ గ్రూప్ అధినేత కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ–యువకుడి మృతి

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలోని సంతోషిమాత గుడి ఎదురుగా సోమవారం బైక్‌ను లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం దొగ్గవానిపాలెం గ్రామానికి చెందిన దమ్ము అప్పలరాజు(35) ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఎస్.కోట బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అరకు–విశాఖ రోడ్డులో సంతోషిమాత గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడితీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతి, హాసిని (12), హసిత్ బాబు పిల్లలున్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ‘ఉక్కు’ పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1082వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రాణత్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఏజీఎం సురేష్

విశాఖ విద్య: ఇండియన్ అసోసియేట్స్ ఫిజిక్స్ టీచర్స్ వారు నిర్వహించిన జూనియర్ ఒలింపియాడ్‌లో విశాఖపట్నం శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. వైజాగ్ జోన్ నుంచి 29 మంది ఎంపికైనట్లు సంస్థ ఏజీఎం ఎంవీ.సురేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య మరోమారు సత్తా చాటుకుందని అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు.